అవగాహన



మోహన్ బాబు విశ్వవిద్యాలయంలోని శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన కంప్యూటర్‌పై అవగాహన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన మహిళా వర్సిటీ ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ పెరుమాళ్లపల్లె ప్రభుత్వ పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు అవనిజ పాల్గొన్నారు.

- చంద్రగిరి

అక్రమం



తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లెలో సర్వే నంబర్ 121/5లోని 1.29 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. సుమారు రూ.4కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతమవుతున్నా అధికారుల్లో స్పందన కరువైంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ జోక్యం చేసుకోవడంతో తహసీల్దార్ నోటీసుల జారీ చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆక్రమణకు పాల్పడిన టీడీపీ నేతలు యథేచ్ఛగా నిర్మాణం కొనసాగిస్తున్నారు.

- తిరుపతి రూరల్

అంధకారం




మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో తిరునగరం నవీన సొబగులను సంతరించుకుంది. ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం లభించింది. అయితే పర్యవేక్షణలోపంతో ఈ రహదారులు కళావిహీనంగా మారుతున్నాయి. నిర్లక్ష్యం నీడలో పచ్చదనం కోల్పోయి మొక్కలు ఎండిపోతున్నాయి. విద్యుద్దీపాలు వెలగకపోవడంతో సుభాష్ చంద్రబోస్ మార్గం, అన్నమయ్య మార్గం, కాటన్ మిల్లు నుంచి తిమ్మినాయుడుపాళెం మీదుగా వేసిన రోడ్డు అంధకారబంధురంగా తయారయ్యాయి.

- తిరుపతి తుడా

కొండ కిందే నిలువు దోపిడీ!

తిరుమల శ్రీవారి దర్శనానికి నిత్యం లక్షలాది మంది తరలివస్తుంటారు. మొక్కు తీర్చుకునేందుకు కొందరు.. సులువుగా వేంకటేశ్వరస్వామిని సేవించుకోవచ్చని మరికొందరు కాలినడకన బయలుదేరుతుంటారు. ఈ మేరకు అలిపిరి.. శ్రీవారి మెట్టు మార్గాలను ఎంచుకుంటూ ఉంటారు. ఇక్కడే ఆటోవాలాలు రంగంలోకి దిగుతుంటారు. కొండపైకి వెళ్లాల్సిన అవసరం లేకుండా కిందనే భక్తులను నిలువునా దోచుకుంటున్నారు. అందులో భాగంగా తిరుపతిలోని రైల్వేస్టేషన్.. బస్టాండ్‌ల వద్ద భక్తులను బుట్టలో వేసుకుంటారు. శ్రీవారి మెట్టు వద్ద టైంస్లాట్ టోకెన్లు ఇప్పిస్తామని మాయమాటలు చెబుతారు. తమ ఆటోలో వస్తే సులభతరంగా దేవదేవుని దర్శనం పొందవచ్చని నమ్మబలుకుతారు. ఇందుకోసం భారీ మొత్తంలో నగదు వసూలు చేస్తుంటారు. ముందస్తుగా కుమ్మక్కైన టోకెన్ కౌంటర్ సిబ్బంది సాయంతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు.

- శ్రీవారి భక్తులకు టోపీ వేస్తున్న ఆటోవాలాలు
- మెట్టు మార్గం వరకు చేర్చేందుకు భారీగా అద్దె బాదుడు
- సులువుగా టైంస్లాట్ టోకెన్లు ఇప్పిస్తామంటూ నగదు వసూలు
- కౌంటర్‌లోని సిబ్బందితో కుమ్మక్కై యథేచ్ఛగా దందా
- అక్రమార్కుల నిర్వాకంతో ఇబ్బందిపడుతున్న బాధితులు



టైంస్లాట్ టోకెన్ల కోసం శ్రీవారిమెట్టు వద్దకు వేలాదిగా చేరుకున్న భక్తులు

చంద్రగిరి : తిరుమల శ్రీవారి దర్శనం సులభతరం చేస్తామంటూ భక్తులను నమ్మించి ఆటోవాలాలు నిలువ దోపిడీ చేస్తున్నన్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను టార్గెట్ చేసి భారీగా నగదు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి శ్రీవారి మెట్టు మార్గాన కాలినడకన వెళితే సులభతరంగా దర్శనం అవుతుంది. దీన్ని అసరాగా చేసుకున్న కొంత మంది ఆటో డ్రైవర్లు కొత్త దందాకు తెరలేపారు. తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద భక్తుల కోసం వేచి ఉండే ఆటో డ్రైవర్లు అక్కడే భక్తులకు వల వేస్తున్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్లే వారికి టోకన్లను తీసిస్తామంటూ ఆశపెడుతున్నారు. ఈ క్రమంలో 5 నుంచి 10లోపు ఉన్న భక్తుల బృందం వద్ద సుమారు రూ.10వేల వరకు నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అపై ఆటోవాలాలు శ్రీవారిమెట్టు వద్దటోకెన్ కౌంటర్ సిబ్బంది ద్వారా అక్రమ మార్గాల్లో టోకెన్లను భక్తులకు అందజేస్తున్నట్లుగా ఫిర్యాదులు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం కూడా ఇదే దందా చేపట్టారని పలువురు భక్తులు మండిపడుతున్నారు. అలాగే శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారి మెట్టుకు కేవలం 6 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. అయితే ఆటోవాలాలు ఒక్కో భక్తుడి నుంచి సుమారు రూ.500లు వసూలు చేస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి ధనదాహానికి శ్రీవారి భక్తులు తిప్పలు పడాల్సి వస్తోంది.

3వేల టోకన్లకు 10వేల మంది!



స్తంభించిన ట్రాఫిక్

ఆటోవాలాల నయా దందాతో శ్రీవారిమెట్టు కాలినడక మార్గానికి వారం వారం భక్తులు పోటెత్తుతున్నారు. గత వారం టోకెన్ల కోసం 7 వేల మంది భక్తులు చేరుకోగా, శనివారం సుమారు 10 వేల మంది వరకు వచ్చినట్లు టీటీడీ అధికారులు అంచనా వేశారు. తిరుమలకు చేరుకోవడానికి శ్రీవారి మెట్టు దగ్గర మార్గం కావడం, ఆటోవాలాలు అక్రమంగా టోకన్లను తీసివ్వడం వంటి వాటితో భక్తులు ఈ దారినే ఎంచుకుంటున్నారు. అయితే టీటీడీ అధికారులు మాత్రం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకోకుండా కేవలం 3వేల టోకన్లను మాత్రం జారీ చేస్తుండడంతో గందరగోళం ఏర్పడుతోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టోకెన్ కేంద్రాల వద్ద భద్రతకు కేవలం ఇద్దరు సిబ్బందినే నియమించారంటూ వాపోతున్నారు. టోకెన్ల కోసం పోటిపడే క్రమంలో తొక్కిసలాట జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారుల మేల్కొని ఆటోవాలాల దందాను అరికట్టడంతో పాటు భక్తులకు సరిపడేలా టోకెన్లు మంజూరు చేయాలంటూ కోరుతున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్ : డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ రచించిన శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అనే పుస్తకాన్ని శనివారం టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, డీపీపీ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ



ఆటల పోటీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎర్రావారిపాళెం (భాకరాపేట): ఎర్రావారిపాళెం ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధన, అభ్యసన సామగ్రి తయారీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శనివారం ఈ మేరకు తరగతులను ఎంఈఓ బాలసుబ్రమణ్యం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల స్థాయికి అనుకూలమైన బోధన, అభ్యసన సామగ్రి తయారీ విధానాలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్పీలు నాగేశ్వర, సత్యనారాయణ, సీఆర్ఎంటీ రామ్మోహన్ పాల్గొన్నారు

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట : విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై లైన్‌మన్ ఆనందరెడ్డి మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎర్రావారిపాళెం మండలం ఉస్తికాయలపెంట పంచాయతీ దేవావాండ్లపల్లెకు వెళ్లి ఆనందరెడ్డి భార్య జ్యోత్స్న, కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి (నాని), తండ్రి రామలింగారెడ్డిని పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, రమేష్, మధుసూదనరెడ్డి, హరినాథరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి, హరి పాల్గొన్నారు.

వైన్‌షాపు ఏర్పాటుపై ఆగ్రహం



ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

తిరుపతి రూరల్ : మండలంలోని లింగేశ్వర నగర్ పంచాయతీలో ఇళ్ల మధ్య వైన్‌షాపు ఏర్పాటు చేస్తుండడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఈ మేరకు దుకాణ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సర్పంచ్ కోటేశ్వర రావు ఘటనాస్థలానికి చేరుకుని మహిళలకు అండగా నిలిచారు. పంచాయతీ అనుమతులు తీసుకోకుండా అధికారులు ఇలాంటి చర్యలకు దిగడం సరికాదని మండిపడ్డారు.

గౌరవ వేతనం పెంచాలని డిమాండ్

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాల జూడాలకు గౌరవవేతనం పెంచాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్వీయూ ప్రధాన ద్వారం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వెటర్నరీ జూడాలతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఉదయ్, ప్రవీణ్ కుమార్, నేతలు చంద్ర నాయక్, ఉదయ్ కిరణ్, మోహన్ పాల్గొన్నారు

బ్రహ్మోత్సవాల్లో భక్తుల అవస్థలు



ఆలయం వెలుపల నిరీక్షిస్తున్న దివ్యాంగుడు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గరుడ సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామివారి దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఈ క్రమంలో వీఐపీలు సైతం ఆలయానికి చేరుకోవడం భక్తులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సిబ్బంది ఓవర్‌యాక్షన్‌పై అసహనం వ్యక్తం చేశారు. గోపురం వద్దే అడ్డుకోవడంపై మండిపడ్డారు. దివ్యాంగులను సైతం అనుమతించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

'స్వచ్ఛత'.. అందరి బాధ్యత

తిరుపతి రూరల్ : అవిలాల పంచాయతీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు.తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని తెలిపారు. కార్యదర్శి శ్రీలేఖ పాల్గొన్నారు.

తిరుపతి మంగళం : సప్తగిరినగర్, రణధీర్‌పురం, తిరుమలనగర్, మంగళం, న్యూ మంగళం పంచాయతీల్లో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు స్వాతిశ్రీ, లావణ్య, మురళి, జయశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

వాహనం ఏర్పాటుకు వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్‌కే బాబు

తిరుపతి కల్చరల్ : రోడ్డు మరమ్మతు పనులు చేసే సిబ్బందికి సామగ్రి తరలింపునకు వాహనం ఏర్పాటు చేయాలని 12 డివిజన్ కార్పొరేటర్ ఎస్‌కే.బాబు కోరారు. శనివారం ఈమేరకు కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేసేందుకు అవసరమయ్యే వస్తువులను తోపుడు బండిలో తీసుకెళ్లేందుకు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి : మండలంలోని నారావారిపల్లి, భీమవరం, కొంగరవారిపల్లిలో డ్రోన్ ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో జీవామృతం పిచికారీపై శనివారం అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రోన్ వినియోగించి పిచికారీ ద్వారా సమయం ఆదా అవుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద రావు మాట్లాడుతూ సాంకేతికతతో అధిక ఆదాయం సాధ్యమవుతుందన్నారు. శాస్త్రవేత్త రాము కుమార్, ఏఓ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో 'తుడా టవర్స్'



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో తుడా టవర్స్ నిర్మిస్తున్నామని, మార్చి 8వ తేదీ నుంచి ఇందులో దుకాణాలకు వేలం నిర్వహించనున్నామని తుడా ఉపాధ్యక్షులు మౌర్య తెలిపారు. శనివారం తుడా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాయలచెరువు రోడ్డులో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా టవర్స్ నిర్మిస్తున్నామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు 13 అంతస్తులు ఉంటాయని వెల్లడించారు. గ్రౌండ్, ఒకటవ అంతస్తుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్తుల్లో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన ఫ్లోర్లలో నివాసయోగ్యంగా 2,3,4 బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మిస్తున్నామని వివరించారు. సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య పాల్గొన్నారు.

బహిరంగ మూత్రవిసర్జన అరికట్టండి

నగరంలో బహిరంగ మూత్ర విసర్జనను అరికట్టాలని, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. నగరంలోని చిన్న బజారు వీధి, చింతకాయల వీధి, రామచంద్ర పుష్కరిణి, పల్లివీధి, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కూటమి పాలనలో అరాచకాలు



మాట్లాడుతున్న మల్లం రవిచంద్రారెడ్డి

తిరుపతి కల్చరల్ : కూటమి పాలనలో ఆయా పార్టీల నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కేశవాయనిగుంట సర్వే నంబర్ 57లో 250 అంకణాల మఠం భూమిని కబ్జా చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమిలో చేరిన కార్పొరేటర్లు అక్రమించుకున్న మఠం భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. 2019 నుంచి 2024 వరకు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో నీతివంతమైన పాలన అందించామని వెల్లడించారు. అక్కడ తమ అక్రమ సంపాదనకు ఆస్కారం లేకపోవడంతో కూటమి అధికారంలోకి రాగానే అందులో చేరి పలువురు కార్పొరేటర్లు దందా మొదలు పెట్టారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల నేతృత్వంలో కూటమి నేతలు విచ్చలవిడిగా దోచుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, నేతలు పసుపులేటి సురేష్, అనిల్‌రెడ్డి ,గోపాల్‌రెడ్డి, ఇమామ్, లోకేష్, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : కార్మికుల హక్కుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎల్.రత్నకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చినా నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నేతలు ఆర్.మురళీధర్, షఫీ ఉల్లా,బోదేషావలిల్ల, శ్రీనివాసులు, అనూష పాల్గొన్నారు.

వెంకన్న సేవలో మోహిత్‌రెడ్డి



స్వామివారిని దర్శించుకుంటున్న మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి గరుడసేవను శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వాహన సేవలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం



తిరుపతి రూరల్ : తిరుచానూరు శిల్పారామంలో శనివారం రాత్రి శంకరనాట్య విద్యాలయ వారు ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను పరిపాలన అధికారి ఖాదర్‌వలీ సత్కరించారు.

పైప్‌లైన్ పనులు నిలిపివేత

తిరుపతి మంగళం : మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీలో వేస్తున్న పైపులైన్ పనులను కార్యదర్శి స్వాతిశ్రీ శనివారం నిలిపివేయించారు. పైపు లైన్ వేయడంతో జయశంకర్‌కాలనీ, తుడా క్వార్టర్స్‌లో రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. దీనిపై పంచాయతీకి పరిహారం చెల్లించాకే పైపులైన్ వేసుకోవాలని స్పష్టం చేశారు.

భూత వాహనంపై అగస్త్యేశ్వరుడు

చంద్రగిరి : తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం స్వామివారు శేషవాహనంపై ఆసీనులై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రాత్రి భూత వాహనంపై విహరిస్తూ దర్శనమిచ్చారు.

అ'ద్వితీయ రూపం'



సందడి చేస్తున్న కవలలు

తిరుపతి కల్చరల్ : కపిలతీర్థం రోడ్డులోని కొత్తపల్లి ఆనందరావు కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం ఘనంగా అంతర్జాతీయ కవలల దినోత్సవం నిర్వహించారు. చిత్తూరు జిల్లా కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం ఆధ్వర్యంలో 20 మంది కవలలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజోరావు,రాధిక దంపతులు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కేవీఎస్ రాజా, రాజశేఖర్‌రెడ్డి, కొత్తపల్లి శంకరయ్య, టి.సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

సోమస్కందమూర్తి వైభవం



మకర వాహనంపై ఊరేగుతున్న ఆదిదంపతులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం రాత్రి కామాక్షి అమ్మవారితో కలిసి సోమస్కందమూర్తి శేష వాహనంపై విహరించారు. ఈ క్రమంలో ఉదయం స్వామివారు మకర వాహనంపై తేజోవిలాసంగా ఊరేగారు. అనంతరం ఆదిదంపతులకు వేడుకగా స్నపన తిరుమంజనం చేపట్టారు. ర్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన 'విద్యుత్సవ్'



విద్యార్థినులకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో రెండురోజులుగా జరిగిన విద్యుత్సవ్-2025 కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథి తిరుపతి ఐఐటీ డీన్ ప్రొఫెసర్ ఎన్‌పీఎల్ నరసింహమూర్తి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు.ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, ప్రొఫెసర్ సిద్దారెడ్డి, సమన్వయకర్త డాక్టర్ హిమబిందు, షాలిని, పార్థవి సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరు దుర్మార్గం

తిరుపతి కల్చరల్ : విద్యార్థులను దగా చేస్తున్న ప్రభుత్వ తీరు దుర్మార్గమని ఎస్వీయూ విద్యార్థి సంఘాల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర సహాయక కార్యదర్శి బండి చలపతి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో హామీలు గుప్పించిన నారా లోకేష్ నేడు విద్యాశాఖ మంత్రిగా కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులను నమ్మించి గెలిచిన పవన్ కల్యాణ్ ఇప్పుడు కాషాయం వస్త్రాలతో యాత్రలు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పటి వరక ఆ ఊసే ఎత్తకపోవడం పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పీజీసెట్‌ను రద్దు చేయాలని, లేకుంటే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. తిరుమలేష్, మల్లికార్జున, అక్బర్, చిన్న, సుందల విజయ్, వినోద్, ఉదయ్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని సి.మల్లవరం పంచాయతీ సర్పంచ్ మొక్కల భారతి, తిమ్మారెడ్డి శనివారం శ్రీవారి భక్తులకు అన్నదానం చేశారు. శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో గరుడసేవను పురస్కరించుకుని తుమ్మలగుంట నుంచి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి పట్టువస్త్రాలు తీసుకువెళ్లారు. ఆ పాదయాత్రలో వచ్చిన శ్రీవారి భక్తులకు చెవిరెడ్డి చేతులు మీదుగా భక్తులకు భోజనం పంపిణీ చేయించారు.

అభాగ్యులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస సంస్థ ఆధ్వర్యంలో శనివారం అలిపిరి, కపిల తీర్థం ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై ఉన్న అభాగ్యులకు అల్పాహారం, వాటర్ బాటిల్స్ అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, రఘు, శాంతి, లోహిత్ పాల్గొన్నారు.

'మాస్టర్‌ప్లాన్' నుంచి తొలగింపునకు వినతి

తిరుపతి తుడా : బాలాజీ కాలనీ, మ్యూజిక్ కళాశాల ఎదురుగా ఉన్న రెండో స్ట్రీట్ రోడ్డును మాస్టర్ ప్లాన్ జాబితా నుంచి తొలగించాలని స్థానికులు కోరారు. శనివారం ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్‌కు విన్నవిస్తూ లేఖ రాశారు. బాలాజీ కాలనీలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేవని, అందువల్ల 60 అడుగుల రోడ్డు అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న 33 అడుగుల రోడ్డే సరిపోతుందని పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు చేస్తే చాలా ఇళ్లు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.